


# హిరణ్మయి

గుంటూరు శేషేంద్ర శర్మ

హిరణ్మయి ఉన్నత జమీందారీ కుటుంబానికి చెందిన పిల్ల.

వయస్సు పద్దెనిమిది ఏండ్లు. చిన్నవయఃసులోనే చదువుకోసం ఇంగ్లండు వెళ్ళింది. గంగానదీ పురాతనవాయువులు విడిచిపెట్టి, కొన్నినదులు, కొన్ని పర్వతాలు, కొన్ని దేశాల అవతలవున్న థేమ్సునదీ వాయుపరిమళాలు అనుభవించింది; తిరిగివచ్చింది. తండ్రి సంతోషాతిరేకంతో మిత్ర బృందానికి విందు జరిపాడు.

హిరణ్మయి ఇల్లు ఇల్లుకాదు. కొన్ని కొండల్లాంటి సౌధాలు ఉన్న అతి విశాలమైన ప్రాసాదం. బ్రహ్మాండమైన కవాటాలు తెరవగానే ఎర్రపువ్వులు, పసుపు పచ్చపువ్వులు రాల్చే పెద్దపెద్ద వృక్షాలూ, ఇరువైపులా చక్కగా కత్తిరించిన సీమచింత మొక్కల వరుసలతో ముచ్చటగా ఉన్న మార్గాలూ, రంగు రంగుల పువ్వుల మొక్కలూ, పిల్లగాలులూ, గులాబీల పరిమళాలూ కలసి కుక్కపిల్లల్లాగా చెరలాడే శ్రద్ధగా పెంచిన పచ్చిక సీమలు, అక్కడక్కడా నిలువెత్తున అమర్చిన గ్రీకు శిల్పకళా విగ్రహాలు, పాలరాతి వితర్దికలు, ప్రత్యక్షమౌతాయి. నిత్యనూతనంగా సున్నపుపూతలు వేసిన ఆ భవనాలు ఆ శరత్పూర్ణిమ రాత్రి, కళ్ళకు ఎంతో అహ్లాదకరంగా ఉన్నాయి. భవనాల్లో విందు సంచలనం కనుపిస్తూ ఉంటె, తెల్లటి భవనాల్లో లైట్లు కనుపించకుండా అమర్చిన పెద్దపెద్ద గాజుగుమ్మటాలు మంద కాంతులు ప్రసరిస్తున్నాయి. నౌకర్లుచేసే ఏర్పాట్లన్నీ భయ వినయాలతో సాగిపోతున్నాయి. క్రమంగా వస్తున్న మిత్రుల మాటలు, కదలికలు కూడా, అంతా సుశిక్షితులు కనక, సున్నితమైన కంఠస్వరాలతోనే నడుస్తున్నాయి.

కొంచెం సేపట్లో బయట అందమైన కార్లు నిండినట్లుగానే, హాల్లో అందమైన సూట్లు చీరెలు నిండిపోయాయి. అందమైన పంచలు, శాలువాలు, షేర్వాణీలు కూడా లేకపోలేదు. ఘనశ్యాంజీ బంగారు శలాకలాంటి దేహాన్ని మల్లెపువ్వుల్లాంటి చలువపంచె షేర్వాణీలతో ఆచ్ఛాదించుకున్నాడు. షేర్వాణీ భుజాలమీద, మెడచుట్టూ ఉన్న జరీఅల్లికలు లైట్లకాంతుల్లో మెరసిపోతున్నాయి. పాలనురుగు లాంటివలువతో ఒకషోకైన తలపాగ చుట్టాడు. కూతురు వెంటరాగా హాల్లో ప్రవేశిం

చాడు. హిరణ్మయి నందరూ ప్రశంసించారు. హిరణ్మయి హేమంతఋతువులో రెక్కవిచ్చిన గులాబీపువ్వులా ఉంది. స్వచ్ఛమైన జార్జెట్ చీరా, జాకెట్టుల్లో ఉంచుకున్న ఆమె శరీరం అరటాకుల్లో ఉన్న చిగురులాగుంది. గులాబీ పూరేకుల మీద నుంచి రాలే మంచుబిందువుల్లాగా ఆవిడ చెవులనుంచి ఇటూ అటూ రెండు స్వచ్ఛమైన రత్నాలు వ్రేలాడుతున్నాయి. హిరణ్మయి హృదయం వికసించిన అనాఘ్రాత పుష్పంలా స్వచ్ఛంగా ఉంది.

రకరకాల పానీయాలు క్రమంగా గ్లాసుల్లోకి ప్రవించాయి. గ్లాసుల చప్పుళ్ళలో సితార్ తంత్రులు పలుకసాగాయి. రాగ్ బసంత్ సుస్వరాలు హాల్లో మందమందంగా అల్లుకుంటున్నాయి. గోడలకు వ్రేలాడే పెద్ద పెద్ద బంగారుగిల్టు ఫ్రేముల్లో నుంచి గత శతాబ్దపు రాజవంశ పురుషుల చిత్రాలు, చమ్కీదుస్తులు, తురాయి పాగాలు, ఖడ్గాలు ధరించి విశాల నేత్రాలతో వీక్షిస్తున్నాయి. భుజాలమీదకు వ్యాపించిన విగ్గులతో, భుజంమీద నుంచి నడుంవరకు కట్టుకున్న వెడల్పు పట్టలు కుచ్చెళ్ళ చొక్కాలు, బిగించిన షరాయీలు ధరించిన యూరోపియన్ ప్రభువుల చిత్రాలు చిరునవ్వుతో చూస్తున్నాయి. ఇంతలో మరోక ప్రక్క మిత్రులంతా చుట్టుముట్టగా ఒక వ్యక్తి గొంతెత్తాడు. రెండువాక్యాలు విసిరాడో లేదో హాలంతా కరతాళ ధ్వనులతో మోగిపోయింది. తర్వాత మరో రెండు మరో రెండు అలా సాగుతూ ఉంది ఆ శ్రావ్య కంఠం. ఆయన కంఠంతో సితారు తంత్రులు కలిశాయి. అందరూ ఆ వ్యక్తిచుట్టూ మూగారు. హిరణ్మయి ఆ వ్యక్తిని చూస్తూ ఆ కంఠం వింటూ పారవశ్యంలో మునిగిపోయింది. ఆవిడలోవున్న జన్మ సంస్కారాలన్నీ ఆ శ్రుతిలో లీనమయ్యాయి.

ఆకాశంలో తారలు క్రమంగా ఒకటొకటే పశ్చిమదిశకు వాలిపోతున్నాయి. హాల్లో సితారుతంత్రులు మందంగా పలుకుతున్నాయి. అతిథులు క్రమంగా ఒకరొకరే నిష్క్రమిస్తున్నారు. ఆయన కూడా వెళ్ళటానికి కారుదగ్గరకు నడుస్తున్నాడు. డోరు తీస్తూవుండగా భుజం మీద కోమలహస్తం సోకింది. "చెప్పకుండానే వెళ్ళిపోతున్నారే" అంది హిరణ్మయి.

క్షమించండి మరచిపోయాను'' అని వెనక్కి తిరిగా డతను. "రండి కాస్సేపు ఆ పచ్చికలో కూర్చుందాం'' అని హిరణ్మయి ముందు నడుస్తూ ఉండగా ఆయన ఆమె వెంట నడిచాడు. ఇద్దరూ కూర్చున్నారు. పచ్చిక మీ దంతటా నీటితుంపుర్లు చల్లారు గనుక, కూర్చుంటే చల్లగా ఆప్యాయంగా దాని స్పర్శ హాయి గొలుపుతూ ఉంది. అప్పుడప్పుడూ ఇటూఅటూ కదిలే గాలితరగలు వారి మీదికి చల్లదన్నాన్ని వెదజల్లుతున్నాయి.

"మీతో పరిచయం పెంచుకొనే భాగ్యం కలిగిస్తారా" అంది హిరణ్మయి.

''దానికేమిటి హిరణ్మయిగారూ మీ పరిచయం అదృష్టంగా భావిస్తాను. మీరు ఫ్రెంచి ఉరుదూ కవితలు బాగా అధ్యయనం చేశారటగా''—

"మనదేశపు కవిత్వం బంతిపూల పరిమళం; ఫ్రెంచి కవిత్వం మల్లెపూల పరిమళం. ఉర్దూ కవితలో ఒక నాజూకుదనం ఉంటే ఫ్రెంచి కవితలో ఒక మత్తెక్కించే లక్షణముంది."—అంది హిరణ్మయి.

"మీ కవితలో ఈ పరిమళాలన్నీ కలిసే ఉంటాయనుకుంటాను."—

"బలేవారు! మీ కవితలో ఏ పరిమళముందోకూడా చెప్పలేని తన్మయతతో ముంచేశారు. మమ్మల్ని ఇటు కవితతో అటు సితారుతో సమానంగా వ్యవరించగల మిమ్మల్ని వింటుంటే తామరపువ్వు రేకుతో మకరందం త్రాకినట్లుంది."

"హిరణ్మయిగారూ మీరు నాగురించి ఎక్కువ ఆలోచించకండి. కొండల్లో ఎన్నో సెలయేళ్ళు ప్రవహిస్తుంటాయి. ఎన్నో అందమైన పువ్వులుపూసి వాసనలు గుబాళిస్తుంటాయి; అవి ఎవరికీ పనికిరానివి నేనూ అంతే." అన్నాడతను.

"శీతప్రభాసలిల స్నాతచకోర సుందరివో'' అన్నారే యిందాక మీ కవితాగానంలో, ఎవర్ని ఉద్దేశించారో తెలుసుకోవచ్చా.'' అని చిరునవ్వు నవ్వింది హిరణ్మయి. పశ్చిమాకాశాన్ని ఆచ్ఛాదించిన ఒక ముసలి మామిడిచెట్టు కొమ్మల్లోకి వెళ్లుతూ ఉన్న చంద్రుడు వెదజల్లే వెన్నెల్లో ఆవిడ ముత్యాల్లాంటి పండ్లు మిలమిల్లాడాయి. తొడక్రింద చల్లగా ఉందేమిటా అని ఆయన చూచుకుంటే గడ్డిలో నీటితుంపుర్ల మూలాన పంచ తడిసింది. హిరణ్మయి తడిసిన పంచ అంచులు చేత్తో పుచ్చుకుని పిండింది. తెల్ల తామర పువ్వులాంటి ఖద్దరు చలువపంచ చిక్కటి ఆకుపచ్చ పట్టంచుకు అల్లిన బంగారు జరీపోగులు గీచుకొని గులాబీ మొగ్గలాంటి హిరణ్మయి చూపుడు వ్రేలు కొద్దిగా తెగింది. అబ్బా అన్నది. ''నెత్తురొస్తూందా" అన్నాడాయన. వ్రేలినొప్పి కంటే ఆయన నిర్లిప్తత హిరణ్మయికి మరింత ఖిన్నత కలిగించింది.

హిరణ్మయి రెండుసార్లు టెలిఫోన్ చేసినా ఆయనలేడు. రాత్రి ఎనిమిదింటికి చేస్తే దొరికాడు. మర్నాడు సాయంకాలం పన్నుంచి తెమిలి బయటపడి ఆయన పార్కు చేరేసరికి కొంచెం ఆలస్యమయింది. చాలా విశాలమయిన పార్కు-పూలమొక్కలు, పచ్చికబయళ్ళు పూపొదలు తిన్నెలు మాత్రమే కాకుండా అక్కడక్కడా చిన్న చిన్న తామర పూలు కలువపూలు ఉండే సరస్సులు, పెద్ద పెద్ద వృక్షాలు చూస్తే ఆ పార్కు ఒక అందమైన చిన్న అరణ్యం లాగుంది. ఆయన వెతుక్కుంటూ వెళ్ళితే హిరణ్మయి అప్పటికే వచ్చి ఒక కలువపూల కొలను గట్టున ఒక వృక్షం ఆనుకొని ఆయనకోసం



ఎదురు చూస్తూ ఉంది. "క్షమించండి ఆలస్యం చేశాను," అన్నాడాయన. "ఫరవాలేదు" – "ఏమి శెంతసేపయింది మీరొచ్చి"—

"నేనొచ్చా? ఓ పావుగంట అయ్యుంటుంది."

"ఏమండీ, నీళ్ళెక్కువయితే ఈ కలువలు మునిగిపోవా?" అంది హిరణ్.

"అదే చిత్రం. నీళ్ళెక్కువయితే నీటి మట్టంతోపాటు కలువలుకూడా ఎదుగుతాయి. ఎప్పుడూ వాటి చిరునవ్వు మొహాలు మనకు కనుపిస్తూనే ఉంటాయి. మనుషుల మొహాలే చిరునవ్వు కోల్పోతాయి కష్టాలు పెరిగే సరికి."

"ఎంత చక్కగా చెప్పారు. మీలో ఎప్పుడూ ఏదో నిరాశ అపశ్రుతి పలుకుతూ ఉంటుందేమిటి?"

"హిరణ్..." అర్థోక్తిలోనే ఆగాడు.

"ఏమండీ అలా పిలవండి-హిరణ్మయి గారు అంటుంటే నాకేదోలా ఉంటుంది" నవ్వాడాయన. "హిరణ్మయిగారు !"

"అదిగో మళ్ళీ అట్లా పిలుస్తారేమిటి!"

"అబ్బా పోనీండి" అని ఆయన నిట్టూర్పు విడిచాడు. కొలనులో నీళ్ళ మీద, పరచినట్లున్న కలువ ఆకులమీద తన పొడుగాటితోక ఆడిస్తూ ఒక చిన్న నల్లటి పిట్ట ఒక ఆకు మీదనుంచి మరొక ఆకు మీదికి దూకుతూ, ఆకులమీద ముత్యాల్లాగా ఉన్న నీటిబొట్లను ముక్కుతో చిమ్ముతూ వెళ్లుతూఉంది.

"హిరణ్, చూడు" ఆమె చిరునవ్వు నవ్వింది. "చూడు ఆ పిట్ట యోగిలాగా నడుస్తూఉంది నీళ్ళమీద. మనమూ మన జీవన భారాలు దింపుకొంటే అట్లాగే నడవగలమేమో. అంత ఠీవిగా అంత అందంగా" అన్నాడాయన గంభీరంగా.

"ఎట్లా దింపుకొంటాము, ఆ నీళ్ళలో మునిగిపోవడమే మనిషి ఆనందంగా భావిస్తున్నప్పుడు ?"

* * *

శరత్తు పోయింది, హేమంతం వచ్చింది. ముగ్ధమనోహర చంద్రికలు ప్రౌఢ సౌందర్యాన్ని సంతరించుకున్నాయి. మత్తెకించే మల్లెపూల పరిమళాలు మందంగా వ్యాపించే, మంచు తెరల్లో పవ్వళించిన ప్రౌఢసుందరి లాగున్న హేమంత చంద్రిక ఆస్వాదనీయం గాక, హృదయంలో తియ్యని గాయాలు రేపుతూ ఉంది. హిరణ్మయిలో రేకెత్తిన ప్రేమభావాలు వికసించి ఫలించే ఆశలు పోతున్నాయి. "ఏమండీ ఈ రోజుల్లో మిమ్మల్ని ఉన్ని సూటులో చూడాలని ఉంది. నేనిస్తే వేసుకుంటారా ?" అంది హిరణ్మయి అతని కళ్ళల్లోకి చూస్తూ. మందంగా ఒక గాలితరగ కొమ్మల్లో చెరలాడింది. ఒక పసుపుపచ్చ పువ్వు అతని తెల్లటి పంచమీద రాలిపడి పుప్పొడి చిందించింది; ఒక పిట్ట కమ్మటి ఈలవేసి తుర్రున ఎగిరిపోయింది. "హిరణ్ అందంగా ఈల వేసింది అదిగో ఆ పిట్టే; ఎగిరిపోయింది. చూచావా? కొమ్మ చిన్నపోయింది." అన్నాడు విషాదంగా. "అది మీ రనుకోవడమే, వాస్తవం కాదు. మరో పక్షి వస్తుంది, పలుకుతుంది. కొమ్మ ఆకులు రాలుస్తుంది, చిగుళ్ళు వేస్తుంది. పూలు పూస్తుంది, కాయలు కాస్తుంది, పండ్లు పండుతాయి, రాలుతాయి, కొత్త చెట్టు, కొత్త పూలు, కొత్త పండ్లు, మళ్ళీ కొత్త చెట్లు - ఇలా నిరంతంగా సాగిపోయేదే సృష్టి. కొన్ని కళ్ళు ఆకులు రాలిపోవడమే చూస్తాయి. కొన్ని ఆ తర్వాత వచ్చే చిగుళ్ళని చూస్తాయి - మీ స్వభావం అతి కోమలం అందుచేత ఎక్కువగా గాయపడుతుంది. నిరాశకు తావిస్తుంది. అది సరే, మాట మారుస్తారెందుకు? నేనిచ్చే ఉన్నిసూటు వేటుకుంటారా లేదా?" "వేసుకోను" అన్నాడాయన మట్టిబెడ్డొకటి తామరాకు మీదికి విసిరేస్తూ, హిరణ్మయి కళ్ళు చెమ్మగిల్లాయి. ఆయన మరోవైపు చూస్తూ "హిరణ్, ఆ వృక్షాల వెనక సూర్యాస్తమయం రేపిన బంగారు కాంతుల్లో మచ్చుతునకలు హంసల్లా ఈదుతున్నాయి చూడు." "అవును చాలా అందంగా ఉన్నాయి." అంది హిరణ్మయి.

నీడలు పెద్దవవుతున్నాయి. పచ్చిక బయళ్ళమీద సిందూరపు కాంతులు చిలుకరిస్తున్నాయి. చీకట్లు మెల్లిగా చెట్లలోంచి దిగుతున్నాయి. ఎక్కడో దూరాన్నుంచి హిందోళ్ రాగస్వరాలు భారంగా గాలిలో కలసివచ్చాయి. హిరణ్మయి కళ్ళలోంచి ఒక కన్నీటిబొట్టు రాలి ఆయన చేతిమీద వెచ్చగా పడింది. ఉలికిపడి చూచాడు హిరణ్మయి మొహంలోకి బాధగా. హిరణ్మయి ఆయన చెయ్యి గట్టిగా పట్టుకొని వెక్కివెక్కి ఏడ్చింది. ఆమె శిరస్సు మూర్కొని చేత్తో కోమలంగా నిమురుతూ "హిరణ్ మనస్సు నిలదొక్కుకోవాలి నీవు, తప్పుదారి పట్టనీకు; సుఖం అటువైపు లేదు," అన్నాడాయన.

"ఏమండీ నామీద మీకే భావం ఉందో చెప్పండి," అంది ఖచ్చితంగా హిరణ్.

"చెడ్డభావం లేదు" అని పక పక నవ్వాడు.

"ఏమండీ గాటువేసే తుమ్మెద కేం తెలుసు పువ్వు గుండెకయ్యే గాయం, పాటపాడుతూ పోతుంది."

"కోపం వచ్చిందా నవ్వానని? హిరణ్ నిన్ను నిర్మలంగా ప్రేమిస్తున్నాను. కనుకనే నీవు జీవితంలో సుఖించాలని నా కోరిక."

"సుఖించకపోవడానికి నేనేం తప్పు జేస్తున్నాను? ప్రేమించడం తప్పా?"

"హిరణ్ ఈ ప్రశ్నకు సమాధానం సృష్టిలో సూటిగా దొరకదు. దొరుకుతుందని మీలాంటివాళ్ళు అనుకోడంలోనే ఉంది పొరపాటంతా." "మాలాంటి వాళ్ళంటే" అంది హిరణ్మయి.

"మీలాంటి వాళ్ళంటే - విరిసీ విరియని మొగ్గల్లాంటి వాళ్ళు - జీవన శీతతాపాలకు పరిమళాలు పుప్పొళ్లు ఇంకా రాలిపోని వాళ్లు.

హిరణ్ ! నీవు పసిపిల్లవు. అందుచేతనే నీ సుఖం మీద నాకు బాధ్యత ఎక్కువవుతుంది."

"నన్ను పసిపిల్ల అనడం నాకు నచ్చలేదు."

"అవును ఎందుకు నచ్చుతుంది." అన్నాడు ఎగతాళిగా.

"ఏమండీ కళ్ళముందున్నా జీవన సత్యాలు మీ కగనబడవు."

"అంటే నీవు పసిపిల్లవుగా నాకు కనిపించడం జీవన సత్యం కాదనేనా?" అన్నాడు నవ్వుతూ; ఒక్కనిమిషం ఆగి "హిరణ్, జీవితంలో నీ కేది కావాలో నీకు తెలీదు. ఎందుచేతనంటే జీవితంలో ఏమున్నాయో నీ కింకా తెలీదు. లేనిది ఉన్నట్లు ఉన్నది లేనట్లు కనుపిస్తుంది. జీవితం ఒక మయ సభ. ఈ తత్త్వం

తెలుసుకోడానికి నీ వయస్సు చాలదు. నీ సుఖం ఎటువైపుందో నీకు తెలీదు. నిన్ను ప్రేమించేవాడే నీకు దారిచూపాలి... ప్రేమంటే ఏమిటి అని ప్రశ్న వేస్తావా?" అన్నాడు చిరునవ్వుతో.

"కాదు - సుఖమంటే ఏమిటి? ప్రశ్న వేస్తాను."

"హిరణ్ ఈ జీవిత మయ సభలో ఎండమావులు చూచి నీరనుకుని పరుగు లెత్తినట్లు, సుఖమనుకుని దుఃఖంవైపు పరుగులిడుతాము. మన మనస్సుకు తోచిందంతా వాస్తవం కాదు. గాలిని బట్టి మబ్బులకు రూపాలు వస్తున్నట్లు, పరిస్థితులను బట్టి మనస్సుకు రూపం వస్తుంటుంది. కనుక దానికి తోచే భావాలు సాధారణంగా భ్రాంతులు, జీవన సత్యం ఎప్పుడూ దానికి అతీతంగానే ఉంటుంది. అనుభవమే దాన్ని వలవేసి పట్టుకో గలదు."

"నా కిందతా అర్థం కాదు. సుఖమేమిటో సూటిగా చెప్పండి."

"హిరణ్, నీకు హితమయింది చెపుతాను. అది నీ కిష్టమయింది కాకపో వచ్చును. ఇష్టం నీ మనస్సు చెప్పేది. హితం లోకధర్మం చూపించేది."

"ఏమిటా హితం?"

"హిరణ్ నీ కళ్ళలో తొణికిసలాడే అమాయకత్వం చూస్తూంటే నాకు మా పెద్దమ్మాయి జ్ఞాపకం వస్తుంది. నేను మనిషినయితే, నేను చదివిన చదువులు చిత్తశుద్ధితో చదువుకున్నవయితే ఆమెకేది హితమని భావిస్తానో అదే హితమని నీకు చెప్పాలి. హిరణ్ నీవు వయస్సులో విద్యలో గుణంలో నీకు అనుగుణమైన వాణ్ణి ఒకణ్ణి వివాహం చేసుకోవాలి, పిల్లల్ని కనాలి, కళకళ్ళాడే కలువల సరస్సులాంటి సంసారంలో హంసవుగా విహరించాలి, నేను చూడాలి, నా కళ్ళు ఆనందభారంతో రెప్పలు వాల్చాలి."

"అంటే పుత్రపౌత్రాభివృద్ధిగా నా వంశం - కాదు నా భర్తవంశం - వర్ధిల్లాలని నన్ను దీవిస్తున్నారా," అన్నది నవ్వుతూ.

"అవును ప్రతి ఉషఃకాలాన సంధ్యకు మ్రొక్కే పురాతనుణ్ణిగదా, నా బుద్ధి అలాగే ప్రసరిస్తుంది ఏం చేసేది."

హేమంతం శిశిరంలో లీనమయింది. చెట్లు ఆకులు రాలుస్తున్నాయి, కొమ్మలు మ్రోళ్ళయి వేకువవేళల నీటిబొట్లు రాలుస్తున్నాయి. ఆయన ఉన్నిసూటులో వచ్చాడు, "ఈ సూటులో చాలా అందంగా ఉన్నారు," అంది హిరణ్మయి.

"ఏమో చూట్టానికి అట్లా అన్నానేమో కానీ స్టేజీమీదికి వేషంతో వచ్చినవాడికి అవతలకు వెళ్లి అది తీసేసేవరకూ ఎట్లా ఉంటుందో, ఈ సూటు వేసుకుంటే నాకు అట్లా ఉంటుంది."

"పోండి, ఎప్పుడూ ఆ వెధవ పంచలాల్చీ మీరున్నూ, మీ రెప్పుడూ సూట్ వేసుకోవాలి."

"హిరణ్ ... ఈ జన్మలో కాదు. హిరణ్ నాకు స్వేచ్ఛకావాలి, ఆత్మకు హాయి కావాలి - సూటుకాదు."

"సూటు వేసుకుంటే హాయిగా ఉండదా? ఏమిటండీ మరీను."

"నేను సనాతనుణ్ణి గదా ..."

"అసలీ మధ్య నాకో కోరిక తరచూ కలుగుతూ ఉంది ... హాయిగా పిలక పెట్టుకోవాలనీ ... ఇంకా ..."

"ఆఁ - హిమాలయాలకు పోవాలనీ, తపస్సు చెయ్యాలనీ..."

"ఏం తప్పా?"

"తప్పు లేదు కానీ, మీరు హిమాలయాలకు వెళ్ళినా, ఏ గుహల్లో దాక్కున్నా ఈ హిరణ్ మాత్రం మీకు తప్పదు. నాకూ ఒక రుద్రాక్షమాల ఇవ్వండి, నేనూ వస్తాను."

"హిరణ్ - ఎట్లా నీతోటి - నిన్ను నొప్పించకుండా నీ మనస్సు మారుద్దామనుకుంటే నావల్ల కావడం లేదు."

ఆడదానికి మగవాడికి మధ్య ప్రేమ అంటేదాని పర్యవసానం పెళ్ళి, పిల్లాజల్లా సంసారమూ ఇదీ క్రమం. ఈ వాస్తవాన్ని ఈ చేదుసత్యాన్ని మనం ఒప్పుకోము. ఏవేవో పెద్దపెద్ద రంగులు పులిమి ప్రేమ అనే పెద్ద పేరుపెట్టి మెడకు చుట్టుకుంటాము. ఇది తెలుసుకోంటే మనం ఏది ధర్మమో అది చేసి జీవితంలో సుఖపడతాము; లేదా ఆ భ్రాంతిలో పొరపాటు చేసి దుఃఖంలో పడతాము. భ్రాంతి తియ్యగా ఉంటుంది. కనుక దాన్ని విడిచిపెట్టడానికి కొంచమైనా ఒప్పుకోదు మనస్సు. మరి మన ఇద్దరిమధ్యా ఇదెట్లా సాధ్యమవుతుంది. హిరణ్, నా మాట విని నీ మనస్సు నిగ్రహించుకో."

"మీరు చెప్పిందే నిజమయితే నాకసలు పెళ్ళే అక్కరలేదు."

"హిరణ్ నీ వెవరు ఆ మాట అనడానికి? ఇప్పు డనగలిగావు గానీ ఆ మాట, కొన్నేళ్ళు గడచి జీవితంలో ఇంకా ప్రయాణంచేసినతర్వాత, నీవుఅలసిపోయి, చీకట్లు ముసురుకునేవేళ, ఇంటికి వచ్చి తలుపు తీసి దీపం వెలిగిస్తావు, ఏకాంతంగా విశ్రమిస్తావు. అప్పుడు జీవనధర్మం నీ హృదయం తలుపులు బద్దలుకొట్టి నీలో ప్రవేశిస్తుంది. మరొకప్పుడు-బయట జోరు వాన కురుస్తుంటుంది. లోకం నిశ్శబ్దతలో మునిగి ఉంటుంది. నిద్రపట్టదు, అప్పుడు నిన్ను జీవనధర్మం బాధించేవేళ వచ్చిందన్న మాట. హిరణ్, ఆడది లేనిదే మగవాడు బ్రతకలేడు, మగవాడు లేనిదే అట్లాగే ఆడది బ్రతకలేదు. ఇది మన ఇష్టంకాదు. ప్రకృతి శక్తిఒడిలో మనం శిశువులం."

హిరణ్మయి ఏడ్చింది. దూరాన చీకట్లో చెట్లు మౌనంగా ఉన్నాయి.

"ఏమండీ నేను జీవనధర్మంమీద తిరగబడతాను. నేను దానికి లొంగను. ఏనాటికైనా నేను రుద్రాక్షమాల మీ చేతిమీదుగానేతీసుకొంటాను, లేదాఇలాగేరాలిపోతాను," అనిమందంగానవ్వింది హిరణ్మయి.

"హిరణ్, మరొక్కమాట చెప్పనా?

నేనంటే నీ వనుకునే ఈ ప్రేమ నీ కెందుకు కలిగిందో ఆలోచించావా?" అన్నాడు గంభీరంగా.

"ఎందుకు కలుగుతుందో ఎవరైనా, ఎవరికైనా, ఎప్పుడైనా చెప్పారా?"

"నీ వనుకునే ప్రేమ ఎవర్నీ ఎవరికీ ఎప్పుడూ కారణం చెప్పనీదు ఆలోచించ నీదు. అదే దాని శక్తి. అందుచేతనే దాని స్వరూపాన్ని అర్థంచేసుకోవాలి, నీ ప్రేమకు కారణాలున్నాయి. సాధారణంగా ఇందులో రూపానికి ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. రూపాలు శాశ్వతం కావు. మరో పదేళ్ళ తర్వాతయినా నా జుట్టు రాలిపోతుంది, నా పండ్లు ఊడిపోతాయి, మొహంలో ముసలితనం తొంగిచూస్తుంది. అది అనివార్యం. అప్పుడు ఈ రూపం ఇంత ఆకర్షణీయంగా ఉండదు. నన్ను ప్రేమిస్తే భయంకర పరిణామాలకు గురి అవుతావు సుమా! ఆలోచించు.''

"ఏమండీ నన్ను పసిపిల్ల అన్నవారు మరెట్లా మాట్లాడుతాను? ఏమయినా సరే నా బుద్ధి రెండు భావాలను ఆశ్రయించదు." చాలాసేపుఇద్దరూనిశ్శబ్దంగా ఉన్నారు. చలి ఎక్కువయింది. పార్కులోవాళ్ళు చాలా మంది వెళ్ళిపోయారు.

"అయితే హిరణ్ ఒకటి చెపుతాను విను. పదేనిమిదేళ్లు ఎవర్నీ పెళ్ళిచేసుకోకుండా ఉండు. ఆ తర్వాత కూడా నన్నే పెళ్ళిచేసుకోవాలని ఉంటే, నిన్ను తప్పని సరిగా పెళ్ళి చేసుకుంటాను. రెండో వివాహమయినా ఫరవాలేదు."

* * *

తర్వాత కొన్ని శరత్తులు కొన్ని వసంతాలు వచ్చాయి పోయాయి. అతను దేశంలో ఎక్కడో దూరంగా జీవితం గడుపుతున్నాడు. పదేనిమిదేళ్ళు దాటి అంతకు రెట్టింపు ఏళ్ళు గడిచాయి.

ఒక వసంత ఋతువులో కాశ్మీరులో చెట్లు పూచాయి; మంచు కరిగి కొండల మీదనుంచి ఏళ్లు పరుగెత్తుతున్నాయి; పతులు కొత్తరెక్కలు సవరించుకొని మృదు మధురంగా పాడుతున్నాయి; సీతాకోకచిలుక పువ్వులమీద గంతులు వేస్తూఉంది. ఒకఅందమైన వసతి భవనంలో ఘనశ్యాంజీ మిత్రులతో విందు చేసుకొంటున్నాడు. అతిథులు చిన్న చిన్న గుంపులుగా చెదిరి సరదాగా మాట్లాడుకుంటున్నారు. క్రమంగా ఒకరొకరు వెళ్ళిపోతున్నారు. హిరణ్మయిని వెనక నుంచి ఒక గొంతు పిలిచింది. స్నేహితురాలితో మాట్లాడుతున్న హిరణ్మయి వెనక్కి తిరిగి చూచింది. ఎవరో ఒకతను–తలమీద అక్కడక్కడా వెండిపోగుల్లా మెరిసే వెంట్రుకలు, పెదవుల్లో నుంచి దృశ్యాదృశ్యంగాకనిపిస్తూకృత్రిమాన్ని తీసుకొస్తున్న కట్టుడుపండ్లు, మొహంలో అక్కడక్కడ ముడతలు, ఉన్నిసూటు, చేతికర్ర – అతను దగ్గరకు సమీపించాడు.

"హిరణ్ నిన్ను చూచిపోదామని వచ్చాను. అవతల వీధిలో ఉంటున్నామ్మేము." హిరణ్ అతని గొంతునుబట్టి పోల్చుకుంది.

"అలా గులాబిపొద దగ్గరకు వెడదాం పద" అన్నాడు. ఆమె ఆయన వెంట నడిచింది.

"హిరణ్ పెళ్ళి చేసుకున్నావా" అన్నాడు మృదుస్వరంతో — నవ్వుతూ, లోపల ఏదో గొప్ప ధైర్యంతో.

"చేసుకోలేదు" అన్నది గంభీరంగా హిరణ్మయి. ఆమె స్వరం ఎండిపోయిన ఎడారిలా ఉంది.

"నిజంగానా!!!'' అని నిర్ఘాంతపోయాడతను. హృదయంలో కల్లోలం ఉవ్వెత్తుగా చెలరేగింది. నేను జీవితాన్ని అర్థం చేసుకోవడంలో పొరపాటు పడ్డానా, ఒక నిష్కల్మష ప్రేమ ఖాండాన్ని కాలితో తన్నేశానా, ఇరవై ఏళ్ళు గడిచినా హిమాలయంలా ఉన్న ఈ ప్రేమ ఏమిటో తెలుసుకోలేకపోయిన అజ్ఞానుణ్ణి. ఈ నా పాపానికి నిష్కృతి ఉంటుందా, అని అంతరంగిక కల్లోలానికి తట్టుకోలేక విరిగిపోయాడతను. తటాల్నకన్నీళ్ళతో హిరణ్మయిని గట్టిగా కౌగలించుకున్నాడు. కానీ – హిరణ్మయి ఆబంధంలో ఒక్కక్షణంకూడా నిలవలేకపోయింది; ఒక్కసారిగా ఆ బంధం త్రెంచుకొని వేగంగా ఇంటివైపు పరుగెత్తుకొనిపోయింది. అందరూ ఆశ్చర్యంగా అటువైపు పరుగెత్తారు.

ఆ ఉన్నిసూటులోఉన్న ముసలిమూర్తి ఆ గులాబి పొదప్రక్కనే ఉషఃకాంతులు వెళ్ళిపొమ్మనేవరకూ అలాగే స్తంభించిపోయాడు.

హిరణ్మయి పడకగదిలోకి పరుగెత్తి తలుపులు వేసుకొని పరుపుమీద పడిపోయింది. ముఖం కప్పుకుని ఏడ్చింది – కాస్సేపటికి తేరుకుని పెద్ద నిట్టూర్పు విడిచింది. "భగవాన్! నన్ను దుఃఖకూపంలో పడకుండా రక్షించావనుకోనా? జీవిత సత్యాన్ని కనపరిచావనుకోనా? ఏమనుకోమంటావుచెప్పు?" బహుశా, ఈ భావమే ఆమె నిట్టూర్పుగావచ్చి ఉండాలి.

